

నేడు ఎంఎల్‌సిగా కవురు ప్రమాణ స్వీకారం

పాలకొల్లు నుంచి అమరావతికి భారీ ర్యాలీకి సన్నద్ధం



ప్రజాశక్తి - పాలకొల్లు

జెడ్‌పి ఛైర్మన్ కవురు శ్రీనివాస్ శాసనమండలి కార్యాలయంలో ఎంఎల్‌సిగా సోమవారం ప్రమాణస్వీకారం చేయనున్నారు. పాలకొల్లులోని వైసిపి కార్యాలయం నుంచి సోమవారం ఉదయం ఆరు గంటలకు భారీ ఊరేగింపుగా వెళ్లడానికి వైసిపి నేతలు, కార్యకర్తలు ఏర్పాట్లు చేశారు. పలు కారులతోపాటు స్కూల్ బస్సులను ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. ఇదిలా ఉండగా కవురు శ్రీనివాస్ జెడ్‌పి ఛైర్మన్ పదవికి ఇంకా రాజీనామా చేయలేదు. సోమవారం ఆ పదవికి రాజీనామా చేస్తారని సమాచారం.

పొత్తు పరేషాన్..!

- టిడిపి, జనసేన ఆశావహుల్లో గుబులు
- జనసేనకు కేటాయించే సీట్లపై టిడిపి కేడర్‌లో చర్చ
- రెండు జిల్లాల్లో ఐదు నుంచి ఏడు స్థానాలు జనసేనకు అంటూ ప్రచారం
- టిక్కెట్ రాకపోతే ఏం చేయాలనే ఆలోచనలో ఆశావాహులు
- జిల్లా నుంచి పవన్ మళ్లీ పోటీకి దిగేనా అని సర్వత్రా చర్చ



ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

వచ్చే ఎన్నికల్లో టిడిపి, జనసేన పొత్తు తథ్యమంటూ జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ ప్రకటించడంతో జిల్లాలోని టిడిపి, జనసేన పార్టీల నుంచి ఎంఎల్‌ఎ టిక్కెట్ ఆశిస్తున్న నాయకుల్లో గుబులు మొదలైంది. పొత్తు కుదిరితే తాము ఆశిస్తున్న నియోజకవర్గంలో టిక్కెట్ వస్తుందా, లేదా అనే ఆందోళన నేతల్లో నెలకొంది. దీంతో ఇప్పటి నుంచే తమ స్థానాలను పదిలం చేసుకునేందుకు పైస్థాయిలో పావులు కదుపుతున్నట్లు సమాచారం. 2024 సాధారణ ఎన్నికల్లో టిడిపి, బిజెపి, జనసేన పొత్తుతోనే ఎన్నికల బరిలోకి దిగుతామని పవన్‌కల్యాణ్ స్పష్టం చేశారు. తమకు పట్టున్న ప్రాంతాల్లో తమ సత్తా చాటుతామని ప్రకటించారు. జనసేనకు పట్టున్న జిల్లాల్లో ఉమ్మడి పశ్చిమగోదావరి ఒకటి. కాపు సామాజిక తరగతి ఓటర్లు ఈ జిల్లాలో అధికంగా ఉన్నారు. చిరంజీవి స్థాపించిన ప్రజారాజ్యం పార్టీ ఎన్నికల్లో పోటీ చేసినప్పుడు, 2019 ఎన్నికలో జనసేన పోటీ చేసినప్పుడు వచ్చిన ఓటింగ్ శాతం అందుకు నిదర్శనం. 2019 ఎన్నికల్లో తాడేపల్లిగూడెం, నరసాపురం, భీమవరం, పాలకొల్లు వంటి పలు నియోజకవర్గాల్లో ప్రధాన పార్టీలకు ధీటుగా జనసేన అభ్యర్థులు ఓట్లు సాధించారు. జిల్లాల విభజన జరిగిన తర్వాత ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలో 14 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా ఐదు లేక ఏడుస్థానాలు జనసేనకు కేటాయించే అవకాశం ఉన్నట్లు ఇరుపార్టీల నాయకులు అంచనా వేస్తున్నారు. అదే జరిగితే ఇప్పటికే టిడిపి నుంచి టిక్కెట్ ఆశిస్తున్న నాయకుల పరిస్థితి అగమ్యగోచరంగా మారనుంది. అదే సమయంలో పలు నియోజకవర్గాల్లో టిక్కెట్ ఆశిస్తున్న జనసేన నాయకులకు ఎదురుదెబ్బ తగలనుంది. జనసేనకు పట్టున్న నియోజకవర్గాల్లో ఉంగుటూరు, తాడేపల్లిగూడెం, భీమవరం, పాలకొల్లు, నరసాపురంతోపాటు ఏలూరు, తణుకు ఉన్నట్లు చెబుతున్నారు. ఈ నియోజకవర్గాల్లో జనసేన అభ్యర్థులు బరిలోకి దిగితే టిడిపి నాయకుల పరిస్థితి ఏమిటో అర్థంకాని పరిస్థితి ఉంది. ఉంగుటూరు నియోజకవర్గంలో గతంలో టిడిపి ఎంఎల్‌ఎగా పనిచేసి ప్రస్తుతం ఏలూరు జిల్లా టిడిపి అధ్యక్షునిగా గన్ని వీరాంజనేయులు ఉన్నారు. ఈ సీటు జనసేనకు కేటాయిస్తే గన్ని పరిస్థితి ఏమిటనే చర్చ నడుస్తోంది. తాడేపల్లిగూడెం టిక్కెట్‌ను మాజీ జెడ్‌పి ఛైర్మన్ ముళ్లపూడి బాపిరాజు ఆశిస్తున్నారు. ఇది జనసేనకు కేటాయిస్తే టిడిపి నాయకుల నుంచి స్పందన ఏవిధంగా ఉంటుందనే చర్చ సాగుతోంది. భీమవరం, నరసాపురం, పాలకొల్లు, ఏలూరు వంటి నియోజకవర్గాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. అదే సమయంలో టిక్కెట్‌పై ఆశతో ఐదేళ్లుగా పని చేస్తున్న జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జుల పరిస్థితి ఏమిటనే ప్రశ్నలు నెలకొన్నాయి. పొత్తులో భాగంగా టిక్కెట్ రాని నాయకులు కొత్త సమస్యలు సృష్టించే ప్రమాదం ఉంటుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. టిక్కెట్ రాకపోతే పొత్తులో భాగంగా పోటీ చేసిన అభ్యర్థికి మిగిలిన పార్టీల నాయకులు సహకరిస్తారా అనే అనుమానాలు నెలకొన్నాయి. పొత్తుపై పవన్‌కల్యాణ్ ప్రకటన తర్వాత ప్రతి గ్రామంలోనూ సీట్ల కేటాయింపుపైనే చర్చలు సాగుతున్నాయి. పవన్‌కల్యాణ్‌కు సిఎం పదవి ఇవ్వాలని కాపు సామాజిక తరగతి పెద్దఎత్తున కోరుతోంది. ఆ పరిస్థితి లేకపోతే పొత్తులో ఉన్న పార్టీలకు ఈ సామాజిక తరగతి అండగా ఉంటుందా అనే లెక్కలు సైతం వేస్తున్నారు.

జిల్లాలో పవన్ పోటీ చేస్తారా?

గత ఎన్నికల్లో జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ భీమవరం నుంచి పోటీ చేసి ఓటమి చెందారు. ఈసారి మళ్లీ భీమవరం నుంచి పోటీకి దిగుతారా అనే చర్చలు సైతం సాగుతున్నాయి. లేకపోతే జిల్లాలో వేరే స్థానం నుంచి పోటీకి దిగుతారా అనే మీమాంస సాగుతోంది. ఇప్పటి వరకూ మాత్రం జిల్లా నుంచి పవన్ పోటీ చేస్తారనే సంకేతాలు జనసేన నుంచి ఎక్కడా వినిపించడం లేదు. సొంత జిల్లా అయినప్పటికీ 2009లో ప్రజారాజ్యం తరపున పాలకొల్లు నుంచి పోటీ చేసిన చిరంజీవి, 2019లో జనసేన నుంచి భీమవరం నుంచి పోటీ చేసిన పవన్‌కల్యాణ్, నరసాపురం ఎంపీ స్థానానికి పోటీ చేసిన నాగబాబు జిల్లా నుంచి గెలుపొందలేకపోయారు. దీంతో వచ్చే ఎన్నికల్లో జిల్లా నుంచి పవన్ పోటీకి దిగుతారా అనే సందిగ్ధత కొనసాగుతోంది.

పుట్టిన రోజు నాడే మృత్యుఒడికి..!

ఆగి ఉన్న లారీని ఢీకొని యువకుడు మృతి

ప్రజాశక్తి - కలిదిండి


ఏకేష్ (ఫైల్‌ఫొటో)

పుట్టిన రోజునే మృత్యువాత పడిన యువకుని విషాదాంతం మండలంలో ఆదివారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. పుట్టిన రోజును తల్లిదండ్రులు, బంధుమిత్రుల సమక్షంలో సంతోషంగా గడుపుకోవాలనుకుని ఇంటికి బయల్దేరిన ఆ యువకుడిని గుర్తు తెలియని లారీ ఢీకొనడంతో మార్గమధ్యంలోనే ప్రాణాలు విడిచాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని కోరుకొల్లు పాత హరిజనవాడకు చెందిన చాబత్తిన ఏకేష్ (24) పశ్చిమగోదావరి జిల్లా భీమవరం నుండి కోరుకొల్లు బైక్‌పై వస్తున్నాడు. గుర్వాయిపాలెం బంకు వద్ద రోడ్డుకు అడ్డుగా ఆగి ఉన్న గుర్తు తెలియని లారీని ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో తలకు బలమైన గాయమై ఏకేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఆదివారం తెల్లవారుజామున సుమారు 2.30 గంటల సమయంలో ఈ సంఘటన చోటుచేసుకుంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మణికుమార్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గుడివాడ ప్రభుత్వా సుపత్రికి తరలించారు. ఏకేష్ తల్లికి కడుపులో కణితి రావడంతో ఇటీవలే వైద్యులు ఆపరేషన్ చేసి తొలగించారు. ముందురోజే తల్లిని ఆసుపత్రి నుంచి ఇంటికి తీసుకొచ్చారు. ఆపై భీమవరంలో డిజె సౌండ్ సిస్టమ్ పని పూర్తి చేసుకుని ఇంటికెళ్తూ ఏకేష్ ప్రమాదంలో మృతి చెందడం అందరినీ కలిచివేసింది.



కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న మహిళలు

మహిళా సంఘాల ఆధ్వర్యాన కొవ్వొత్తుల ర్యాలీ

ప్రజాశక్తి - ఏలూరు

మహిళా రెజర్లపై బిజెపి ఎంపీ బ్రిజ్‌భూషణ్ లైంగిక వేధింపులకు పాల్పడటం, ఎంపీపై కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడాన్ని నిరసిస్తూ మహిళా సంఘాల ఆధ్వర్యాన కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. స్థానిక పవర్‌పేటలోని ఐద్వా కార్యాలయం నుంచి పాత బస్టాండ్ వరకు మహిళా సంఘాల ఆధ్వర్యాన కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళా నేతలు హైమావతి, యామిని, వాణి, వరలక్ష్మి మాట్లాడుతూ మహిళలను వేధించిన బిజెపి ఎంపీ బ్రిజ్‌భూషణ్‌ను వెంటనే అరెస్టు చేయాలని, కమిషన్ ఇచ్చిన నివేదికను బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు శారద, మేతర అజయ్ బాబు, లెనిన్, ఉష, స్వాతి, భవాని, శివకుమారి, పవన్, ప్రసాద్ పాల్గొన్నారు.

మామిడికాయలు పంచుతున్న రైతు



ధర లేదని.. ఉచితంగా ఇచ్చేశాడు..!

మామిడి రైతు వినూత్న నిరసన

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

ఏయేటికాయేడు మామిడి రైతు కుదేలవుతూనే ఉన్నాడు.. మంచి దిగుబడి ఉంటే.. ధర తగ్గిపోతుంది.. దిగుబడి తగ్గితే ధర అమాంతం పెరుగుతుంది.. ఈ తరుణంలో మామిడి రైతును ప్రభుత్వం కనీసం పట్టించుకోవడం లేదు. ఎప్పటిలాగానే ఈ ఏడాది కూడా వారికి నష్టాలు తప్పలేదు. ధర పూర్తిగా పడిపోవడంతో ఓ మామిడి రైతు వినూత్నంగా తన నిరసన తెలిపాడు. తనపొలంలోని మామిడి కాయలను నూజివీడు పట్టణానికి తీసుకొచ్చి అందరికీ ఉచితంగా పంచి నిరసన తెలిపాడు. ఈ ఘటన పట్టణంలో ఆదివారం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. ఈదర గ్రామానికి చెందిన బెక్కం రాజగోపాల్‌కు సుమారు మూడు ఎకరాల మామిడి తోట ఉంది. ఈ ఏడాది దిగుబడి ఆశాజనకంగా ఉందని సంతోషించే లోపు ధర పూర్తిగా పడిపోవడంతో నిరాశకు గురయ్యాడు. ధర లేదని, మార్కెట్ తీసుకెళ్లినా రవాణా ఛార్జీలు కూడా రావడం లేదని, ఈ క్రమంలోనే మామిడి కాయలను ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపాడు. దళారుల వల్ల మరింత నష్టపోతున్నామని, మామిడి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని రాజగోపాల్ డిమాండ్ చేశాడు.

మొరాయించిన రేషన్ సరఫరా వాహనం

బియ్యం కోసం ప్రజల అవస్థలు


ప్రజాశక్తి - ముదినేపల్లి


మరమ్మతులకు గురైన వాహనం

మండల కేంద్రమైన ముదినేపల్లిలో ఇంటింటికీ రేషన్ బియ్యం పంపిణీ వాహనం నిలిచిపోయింది. ఈ నెల ఒకటో తేదీ నుంచి వాహనం ద్వారా పంపిణీ చేయాల్సిన రేషన్ బియ్యం 14 రోజులుగా పంపిణీ చేయకపోవడంతో కార్డుదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ముఖ్యంగా వృద్ధులు, పేదలు, వ్యాధిగ్రస్తులు బియ్యం పంపిణీ వాహనం రెండువారాలుగా రాకపోవడంతో అగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా ప్రజలకు ఇంటి వద్దకే నిత్యావసర సరుకులు పంపిణీ కార్యక్రమం ఎండియు ఆపరేటర్ల నిర్లక్ష్యం కారణంగా కార్డుదారులు ఇక్కట్లు పడుతున్నారు. ముదినేపల్లి రేషన్ పంపిణీ వాహనం మొరాయించడంతో ఆపరేటర్ స్టాక్ పాయింట్ వద్ద బియ్యం పంపిణీ చేస్తున్నాడు. దీంతో ప్రజలు దూరంగా ఉన్న డిపో వద్దకు వెళ్లి బియ్యం తెచుకోవాల్సి వస్తోంది. ముదినేపల్లి, అన్నవరం కలిపి సూమారు రెండు వేలకుపైగా రేషన్‌కార్డులున్నాయి. వాహనం ద్వారా పంపిణీ నిలిచిపోవడంతో ముదినేపల్లి శివారు అన్నవరం గ్రామస్తులకు ముదినేపల్లిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలో ఉన్న స్టాక్ పాయింట్ వద్ద బియ్యం పంపిణీ చేస్తున్నారు. దీంతో రెండు కిలోమీటర్లు దూరం వెళ్లి బియ్యం తెచ్చుకోవాల్సి వస్తోందంటూ అన్నవరం ప్రజలు అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బియ్యం కోసం రూ.వంద ఖర్చు పెట్టి ఆటోలో తెచ్చుకోవాల్సి వస్తోందంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముదినేపల్లిలో రేషన్ పంపిణీ చేసే వాహనం గతనెలలో మొరాయించింది. అప్పటినుంచి ఎండియు ఆపరేటర్ మరమ్మతులు చేయించలేదు. అధికారులు స్పందించి రేషన్ పంపిణీ సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని కార్డుదారులు కోరుతున్నారు.

వాహనం ద్వారా బియ్యం పంపిణీ చేస్తాం
పిడిఎస్ డిటి చంద్రశేఖర్

ముదినేపల్లి వాహనం మరమ్మతులకు గురైంది. దీంతో ఇంటింటికీ వాహనం ద్వారా బియ్యం పంపిణీ జరగడంలేదు. ప్రజలకు ఇబ్బంది లేకుండా వేరే వాహనం ద్వారా కార్డుదారులకు బియ్యం ఇంటింటికి పంపిణీ చేసే విధంగా చర్యలు తీసుకుంటాం.


నివాళులర్పిస్తున్న నాయకులు, భాస్కర్‌రావు ఫైల్ ఫొటో (ఇన్‌సెట్‌లో)

సిపిఎం నేత భాస్కర్‌రావు మృతి

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

మండలంలోని తుక్కులూరుకు చెందిన సిపిఎం మండల కమిటీ సభ్యులు బందెల భాస్కరరావు(49) అనారోగ్యంతో శనివారం రాత్రి మతి చెందారు. భాస్కర్‌రావు నూజివీడు సీడ్స్ కంపెనీ కార్మిక నాయకుడిగా అనేక పోరాటాల్లో కీలకపాత్ర పోషించారు. పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు గరిసేపల్లి రాజు, మండల కార్యదర్శి నిమ్మగడ్డ నరసింహ, నూజివీడు పట్టణ కార్యదర్శి ఎన్ఆర్.హనుమాన్, నాయకులు భాస్కరరావు భౌతికకాయాన్ని సందర్శించి జోహార్లు అర్పించారు.

కొనసాగుతున్న వేసవి విజ్ఞాన శిబిరాలు

ప్రజాశక్తి - ముదినేపల్లి

ముదినేపల్లి, గురజ గ్రేడ్-3 శాఖ గ్రంథాలయాల్లో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాలు ఆదివారం ఏడో రోజుకు చేరాయి. మదర్స్ డే సందర్భంగా సూర్యనారాయణ మాస్టారు తల్లి ప్రాముఖ్యతను వివరించారు. జెండా రూపకర్త పింగళి వెంకయ్య గురించి తెలియజేశారు. అనంతరం టేబుల్స్, లెమన్ అండ్ స్పూన్, గోనె సంచులు, మ్యూజికల్ ఛైర్స్ తదితర ఆటలు ఆడించారు. జూన్ 11వ తేదీ వరకు జరిగే ఈ వేసవి విజ్ఞాన శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ముదినేపల్లి, గురజ శాఖా గ్రంథాలయాల అధికారులు ఎం.శ్రీదేవి, ఝాన్సీ కోరారు.

నేడు యధావిధిగా స్పందన

ప్రజాశక్తి - ఏలూరు

స్థానిక జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలోని గోదావరి సమావేశ మందిరంలో ఈ నెల 15వ తేదీ సోమవారం ఉదయం 10 గంటల నుంచి 'స్పందన' కార్యక్రమం యధావిధిగా నిర్వహిస్తారని జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఒక ప్రకటనలో తెలిపారు. అదేవిధంగా జిల్లాలోని అన్ని డివిజనల్, మండల, మున్సిపల్ కార్యాలయాల్లోను 'స్పందన' కార్యక్రమం యధావిధిగా నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఫిర్యాదుదారులు తప్పనిసరిగా కోవిడ్ నిబంధనలు పాటిస్తూ మాస్కు తప్పనిసరిగా ధరించి భౌతిక దూరం పాటించాలని కోరారు.

ప్రజావ్యతిరేక విధానాలపై పోరాడాలి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రజలకు వివరిస్తూ ప్రజానుకూల విధానాలు అవలంబించే పార్టీలను ఎన్నుకునేలా ప్రజలు ప్రయత్నించాలని సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు కోరారు. ఆదివారం ఏలూరు తిలక్‌నగర్‌లో సీనియర్ కమ్యూనిస్టు, స్వాతంత్ర్య సమరయోధులు, శతాధిక వృద్ధులు తాన రామారావు (విశాలాంధ్ర రాము) సంస్మరణ సభ సిపిఐ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సభకు ఏలూరు చైతన్య వేదిక అధ్యక్షులు, ప్రముఖ న్యాయవాది పిఎస్.చందు అధ్యక్షత వహించారు. ముందుగా రాము చిత్రపటానికి బండి వెంకటేశ్వరరావు పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రామారావు ఆశించిన సమసమాజం దేశంలో ఏర్పడలేదన్నారు. మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మత సామరస్యానికి, లౌకికవాదానికి, ప్రజాస్వామ్యానికి నష్టం కలిగించే విధానాలు అవలంబిస్తుందన్నారు. రాము నిరాడంబర జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని కమ్యూనిస్టు కార్యకర్తలు మత సామరస్యం కోసం, దేశ సమైక్యత కోసం, లౌకిక వాద పరిరక్షణకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఏలూరు ఏరియా కార్యదర్శి ఉప్పులూరి హేమశంకర్, న్యాయవాది పిపి శాస్త్రి, రిటైర్డ్ జడ్జి ఆడబాల లక్ష్మి, ఎఐటియుసి నాయకులు భజంత్రీ శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజానాట్య మండలి కళాకారులు తమ్మ విశ్వేశ్వరరావు విప్లవ గేయాలు ఆలపించారు.


జగన్ పాలనలో బిసి సబ్‌ప్లాన్ నిర్వీర్యం : టిడిపి

కలిదిండి:సిఎం జగన్ పాలనలో బిసి సబ్‌ప్లాన్ వ్యవస్థ నిర్వీర్యమైందని బిసి సెల్ రాష్ట్ర కార్యదర్శి ఆంద్రాజు శ్రీనివాసరావు అన్నారు. కలిదిండిలో ఆదివారం జరిగిన సమావేశంలో మాట్లాడుతూ బిసిల కోసం ఖర్చు చేయాల్సిన రూ.75 వేల కోట్లను దారిమళ్లించి ఆర్థికంగా అణగతొక్కారన్నారు. నాడు స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు కల్పించిన 34 శాతం రిజర్వేషన్లను నేడు 24 శాతానికి కుదించి తీరని అన్యాయం చేశారన్నారు. 13 బిసి భవనాలను, 1187 కమ్యూనిటీ హాళ్ల నిర్మాణాలను జగన్ ప్రభుత్వం నిలిపేసిందన్నారు. ఈ కార్యక్రమంలో బిసి సెల్ జిల్లా అధ్యక్షులు రెడ్డి శ్రీనివాస చక్రవర్తి, సర్పంచి పరసా వెంకటస్వామి, నాయీ బ్రాహ్మణ సాధికార కమిటీ రాష్ట్ర కన్వీనర్ లంకా రత్నరావు, పాము శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆరోగ్య పరిరక్షణకు క్రీడలు దోహదం

టిడిపి నేత గన్ని వీరాంజనేయులు

ప్రజాశక్తి - భీమడోలు


క్రీడాకారులతో గన్ని వీరాంజనేయులు

వేసవి సెలవుల్లో యువత చెడుమార్గాల వైపు పయనించకుండా, ఆరోగ్య పరిరక్షణతోపాటు గెలుపోటములకు అతీతంగా క్రీడా స్ఫూర్తిని అలవర్చుకుని భవిష్యత్తును ఉజ్వలంగా తీర్చిదిద్దుకునేందుకు క్రీడలు దోహదపడతాయని టిడిపి ఏలూరు పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు అన్నారు. భీమడోలు హైస్కూల్ ఆటస్థలం వేదికగా డాక్టర్ బిఆర్.అంబేద్కర్ ప్రీమియర్ లీగ్ టెన్నిస్‌బాల్ క్రికెట్ టోర్నమెంట్‌ను విజయవంతం చేయాలని కోరారు. స్థానిక అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు రాచప్రోలు రాజ్‌కపూర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలను గన్ని ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. టోర్నమెంట్ ప్రారంభోత్సవంలో భాగంగా గన్ని వీరాంజనేయులు బ్యాటింగ్, మాజీ జెడ్‌పిటిసి కరణం పెద్దిరాజు వికెట్ కీపింగ్ చేసి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో గన్ని వీరాంజనేయులు మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా నిర్వహిస్తున్న టెన్నిస్‌బాల్ క్రికెట్ టోర్నమెంట్ విజయవంతానికి అందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. క్రికెట్ టోర్నమెంట్ నిర్వహణకు ముందుకొచ్చిన బిఆర్.అంబేద్కర్ యువజన సంఘం యాజమాన్యాన్ని ఆయన అభినందించారు. టోర్నమెంట్ ప్రధాన నిర్వాహకులు, అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు రాచప్రోలు రాజ్‌కపూర్ మాట్లాడుతూ గత 20 సంవత్సరాలుగా భీమడోలు హైస్కూల్ వేదికగా క్రికెట్ టోర్నమెంట్‌లు నిర్వహిస్తున్నామని తెలిపారు. టోర్నమెంట్ నిర్వహణకు అప్పటి నుంచి ఇప్పటి వరకు ప్రధాన దాతగా గన్ని వీరాంజనేయులు వ్యవహరిస్తున్నారన్నారు. ఆయనతోపాటు మానస ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాల భీమడోలు కరస్పాండెంట్ యలమంచిలి రవీంద్ర కుమార్, మరో దాత కరుటూరి ప్రసాద్, యువజన నాయకుడు గంజి మోజేష్, తదితర దాతలు బహుమతులు అందజేసేందుకు ముందుకొచ్చారని తెలిపారు. టోర్నమెంట్‌లో పాల్గొనేందుకు ఇంతవరకు 30 జట్లు తమ పేర్లను నమోదు చేసుకున్నాయన్నారు. కార్యక్రమంలో పి.యుగంధర్, నిర్వాహకులు మద్దాల రవి, త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

ప్రథమ పోటీ విజేత సూరప్పగూడెం

ఆదివారం ప్రారంభమైన క్రికెట్ టోర్నమెంట్‌లో తొలి పోటీ సూరప్పగూడెం, భీమడోలు జూనియర్ జట్ల మధ్య జరిగింది. ఈ పోటీలో సూరప్పగూడెం జట్టు విజేతగా నిలిచిందని నిర్వాహకులు తెలిపారు.

సిబిఎస్ఇ పదో తరగతి ఫలితాల్లో హర్షిత్ ప్రతిభ

జిల్లాస్థాయిలో సెకండ్ ర్యాంకు

ప్రజాశక్తి - ఏలూరు



సిబిఎస్ఇ పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ఏలూరు నగరానికి చెందిన విద్యార్థి వర్ధినీడి హర్షిత్ గంగాధర్ జిల్లాలో రెండో ర్యాంకు సాధించారు. పెదవేగిలోని నవోదయలో పదో తరగతి చదవిన హర్షిత్‌కు 600 మార్కులకుగాను 564 మార్కులు సాధించి జిల్లా సెకండ్ ర్యాంకు సాధించారు. హర్షిత్ ప్రతిభపై అతని తల్లిదండ్రులు వర్ధినీడి సత్య, వీరవెంకట నాగేంద్ర ప్రసాద్‌తోపాటు పెదవేగి నవోదయ స్కూల్ యాజమాన్యం అభినందనలు తెలిపారు. హర్షిత్ తల్లిదండ్రులు ఏలూరు ఆర్ఆర్‌పేటలోని ఆర్ఎంఎస్ కాలనీలో నివశిస్తున్నారు. ప్రసాద్ మెడికల్ రిప్రజెంటేటివ్‌గా పని చేస్తూ సిపిఐయు, సిపిఎంల్లో పలు బాధ్యతల్లో ఉంటూ వివిధ రంగాల ప్రజల సమస్యలపై పని చేస్తూ ఉంటారు. ఈ సందర్భంగా హర్షిత్ గంగాధర్‌ను సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి, ఏలూరు నగర కార్యదర్శి పి.కిషోర్, సిఐటియు జిల్లా నాయకులు బి.సోమయ్య, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఆర్.లింగరాజు, డిఎన్‌విడి.ప్రసాద్ అభినందించారు.

లోకేష్‌కు సంఘీభావంగా పాదయాత్ర

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్



టిడిపి నేతల పాదయాత్ర

నారా లోకేష్ యువగళం పాదయాత్ర వంద రోజులు పూర్తయిన సందర్భంగా ఆదివారం ఏలూరు పార్లమెంట్ తెలుగు యువత అధ్యక్షులు రెడ్డి సూర్యచంద్రరావు ఆధ్వర్యంలో ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గ తెలుగుయువత సంఘీభావ పాదయాత్ర చేపట్టింది. టిడిపి జిల్లా కార్యాలయం నుండి ఫైర్ స్టేషన్ సెంటర్‌లోని ఎన్‌టిఆర్ విగ్రహం వరకూ ఈ పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా సూర్యచంద్రరావు మాట్లాడుతూ లోకేష్ 400 రోజులు, నాలుగు వేల కిలోమీటర్ల యాత్ర దిగ్విజయంగా పూర్తి చేసుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పోలవరం నియోజకవర్గం తెలుగు యువత అధ్యక్షులు జి.సురేంద్రనాథ్‌చౌదరి, కైకలూరు నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు తావు నాగరాజు, ఏలూరు నియోజకవర్గం తెలుగు యువత అధ్యక్షులు కోన మాణిక్యం, చింతలపూడి నియోజకవర్గ ఎస్‌సి సెల్ అధ్యక్షులు పల్లి శ్రీను, బిసి రాష్ట్ర సాధికారిక సమితి సభ్యులు షేక్ సుభాని, పార్టీ కార్యాలయ కార్యదర్శి పాలి ప్రసాద్, తెలుగు యువత సభ్యులు పాల్గొన్నారు.

వడదెబ్బకు వ్యక్తి మృతి

ప్రజాశక్తి - ముదినేపల్లి


మృతిచెందిన బాలకృష్ణ


వడదెబ్బకు వ్యక్తి మృతిచెందిన ఘటన మండలంలోని పెదపాలపర్రులో శనివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కోనసీమ జిల్లా ఉప్పలగుప్తం గ్రామానికి చెందిన కుసుమ బాలకృష్ణ(38) కృష్ణాజిల్లా బంటుమిల్లి మండలం పెదతుమ్మిడిలో చేపల చెరువులపై పని చేస్తున్నాడు. ఈ క్రమంలో శనివారం బైక్‌పై గుడివాడ వెళ్లి పనులు ముగించుకొని తిరిగి బంటుమిల్లి ప్రయాణమయ్యాడు. ఈ తరుణంలో మండలంలోని పెదపాలపర్రు వద్దకు రాగానే వడదెబ్బకు సొమ్మసిల్లి రోడ్డు పక్కన పడి మృతి చెందాడు. మృతుని సోదరుడు కె.వెంకటేశ్వరరావు ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ షణ్ముఖసాయి కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గుడివాడ ఏరియా ఆసుపత్రికి తరలించారు. బాలకృష్ణకు భార్య ఇద్దరు పిల్లలున్నారు. ప్రస్తుతం భార్య కువైట్‌లో పని చేస్తుంది.

చినవెంకన్న ప్రాణదాన్ ట్రస్టుకు మందులు అందజేత

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయ ప్రాణదాన్ ట్రస్టు ద్వారా నిర్వహిస్తున్న ప్రథమ చికిత్స కేంద్రానికి తెనాలికి చెందిన ఎవి.సాంబశివరావు, కృష్ణాజిల్లా విజయవాడకు చెందిన జెబి కెమికల్స్ ఆర్ఎస్ఎం కమల్ యాత్రికులకు అవసరమైన మందులను ఆదివారం అందజేశారు. ఆలయానికి పాదయాత్రగా వచ్చిన వారికి అవసరమైన సుమారు వెయ్యి మంది యాత్రికులకు సరిపడా ఉచిత మందులను దేవస్థానం ప్రథమ చికిత్స కేంద్రానికి ఆలయ ఇఇ నటరాజారావుకు అందజేశారు. దాతలకు ప్రత్యేక దర్శనం ఏర్పాటుచేసి స్వామి వారి ప్రసాదం అందించారు. ప్రథమ చికిత్స కేంద్రం వైద్యులు రాజేంద్రప్రసాద్, ఆలయ కార్యనిర్వహణాధికారి వేండ్ర త్రినాథరావు దాతలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.


మందులు అందిస్తున్న దాత


సమావేశమైన పూర్వవిద్యార్థులు

ఘనంగా పూర్వవిద్యార్థుల సమ్మేళనం

ప్రజాశక్తి - చింతలపూడి

మండలంలోని ప్రగడవరం మహాత్మ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2000-2001 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. వారికి విద్యాబుద్ధులు నేర్పిన నాటి గురువులు రాజు, విశ్వసుందరం, సుబ్బారావును పూర్వవిద్యార్థులు ఘనంగా సన్మానించారు. అనంతరం విద్యార్థులందరూ ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. వివిధ వృత్తుల్లో ప్రభుత్వ ప్రయివేటు ఉద్యోగాల్లో స్థిరపడిన వారు గతస్మృతులను నెమరు వేసుకుంటూ, చదువుకున్న పాఠశాలలో కలయతిరిగి తమ అనుబంధాలను స్మరించుకున్నారు. సెల్ఫీలు తీసుకుంటూ ఎంతో ఆనందంగా గడిపారు. ఈ కార్యక్రమంలో కోడూరు రమేష్, నరసింహారెడ్డి, రాజేష్, పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు.


సగరలు ఐక్యంగా ఉండాలి

దుర్గ గుడి ఛైర్మన్ కర్నాటి రాంబాబు

ప్రజాశక్తి - ముసునూరు

సగరులంతా సమస్యలపై ఐక్యంగా పోరాడాలని విజయవాడ దుర్గ మల్లేశ్వరస్వామి (దుర్గమ్మ తల్లి) ఆలయ ఛైర్మన్ కర్నాటి రాంబాబు అన్నారు. ఆదివారం ముసునూరులోని శ్రీఅభయాంజనేయస్వామి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన సగరసంఘ మూల విరాట్ భగీరథ మహర్షి విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ సగర కులంలో ఎక్కువ మంది చదువులో వెనుకబడి ఉన్నారన్నారు. అందరూ తమ పిల్లలను చదివించాలని కోరారు. రిజర్వేషన్లో బిసి-డిలో 31వ స్థానంలో ఉన్న సగరులను బిసి-ఎలోకి మార్చేలా అందరం కలిసి పోరాడాలని పిలుపునిచ్చారు. అనంతరం సగరసంఘం రాష్ట్ర అధ్యక్షులు సాదరబోయిన ఏడుకొండలు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సర్పంచి కొండేటి విజయలక్ష్మి, తెల్లివోయిన సత్యనారాయణ, దేవినేని ధరమ్, టి.రంగారావు, రెడ్డి రాంబాబు, గోపీరావు, తాడిశెట్టి వీరాంజనేయులు, సగర సంఘం నాయకులు పాల్గొన్నారు.


విగ్రహావిష్కరణలో దుర్గగుడి ఛైర్మన్



ముసునూరులో ఏర్పాటు చేసిన చలివేంద్రం

ముసునూరులో చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - ముసునూరు

వేసవిలో బాటసారులదాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఎంతగానో దోహదపడతాయని ముసునూరు పంచాయతీ వార్డు సభ్యులు గారపాటి నరసింహారావు అన్నారు. ఆదివారం ముసునూరులోని రైస్మిల్లు సెంటర్ ఐదురోడ్ల కూడలిలో చలివేంద్రాన్ని గ్రామ సర్పంచి కొండేటి విజయలక్ష్మి, టిడిపి మండల అధ్యక్షులు దేవినేని ధరమ్ ఆధ్వర్యంలో ప్రారంభించారు.

నేరాలు - ఘోరాలు

తెలంగాణ మద్యం పట్టివేత

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండలంలోని తాటియాకులగూడెంలోని ఎస్ఇబి అంతర్రాష్ట్ర చెక్పోస్ట్ వద్ద ఆదివారం ఎస్ఇబి ఎస్ఐ బాలాజీ ఆధ్వర్యంలో వాహన తనిఖీల్లో తెలంగాణ రాష్ట్రం నుంచి ఆంధ్రాకు కారులో తరలిస్తున్న 92 టిన్ బీర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. మద్యాన్ని, కారును సీజ్ చేసి జంగారెడ్డిగూడెం ఎస్ఇబి స్టేషన్కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ తనిఖీల్లో ఎస్ఇబి సిబ్బంది శ్యామ్, కిషోర్, ప్రవీణ్ పాల్గొన్నారు.

కారు బీభత్సం

ప్రజాశక్తి - మండవల్లి

అతివేగంగా వెళ్తున్న కారు అదుపుతప్పి ప్రజలపైకి దూసుకొచ్చింది. ఈ ఘటనతో స్థానికులు ఒక్కసారిగా భయభ్రాంతులతో పరుగులు తీశారు. ఈ ఘటన మండలకేంద్రమైన మండవల్లిలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. ఇండియన్ బ్యాంక్ సమీపంలో ఒక కారు అతివేగంగా వచ్చి పక్కన నిలిపి ఉన్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. అంతటితో ఆగకుండా మండవల్లి ప్రధాన సెంటర్ నుండి ఆంజనేయస్వామి గుడివద్ద నిలబడి ప్రజలపైకి దూసుకెళ్లింది. అప్రమత్తమైన స్థానికులు పక్కకు తప్పుకున్నారు. దీంతో ఎవరికీ ఏమీ కాకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. స్థానికులు ఎట్టకేలకు కారును నిలువరించి డ్రైవర్ను బయటకు లాగి నిలదీశారు. అయితే డ్రైవర్ మద్యం మత్తులో ఉన్నట్లు సమాచారం. దీనిపై ఎస్ఐ రామకృష్ణను వివరణ కోరగా ఈ విషయం తనదృష్టికి రాలేదని తెలిపారు.

ప్రతి ప్రాణికీ తొలిగురువు అమ్మ

ఘనంగా మాతృ దినోత్సవం

ప్రజాశక్తి - భీమడోలు

ప్రతిప్రాణికి తొలి గురువు అమ్మ అని మానవత స్వచ్ఛంద సంస్థ భీమడోలు శాఖ ఛైర్మన్ గుళ్ల నూకరాజు అన్నారు. స్థానిక శాఖ గ్రంథాలయంలో గ్రంథపాలకులు కె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరం ఆదివారానికి ఏడో రోజుకు చేరింది. ఈ సందర్భంగా గ్రంథాలయ ఆవరణలో మాతృ దినోత్సవం నిర్వహించారు. దీనిలో భాగంగా స్థానికంగా ఉన్న ప్రముఖులను విద్యాబుద్ధులు నేర్పి, వారు ఉన్నత స్థానాలకు ఎదగడానికి సహకరించిన రిటైర్డ్ ఉపాధ్యాయురాలు, ప్రస్తుత మానవత భీమడోలు శాఖ ఛైర్మన్ నూకరాజును స్థానిక ప్రముఖులు సన్మానించారు. ఈ సందర్భంగా యోగా నిపుణులు భావనారుషి, సత్యసాయి సేవా సమితి సభ్యులు చంద్ర, స్థానిక శాఖ గ్రంథాలయంలో కొనసాగుతున్న వేసవి విజ్ఞాన శిబిరంలో ప్రతి అంశంలోనూ రిసోర్స్పర్సన్గా వ్యవహరిస్తున్న సామాజిక కార్యకర్త మండే సుధాకర్, సత్యేంద్ర పాఠశాల ప్రిన్సిపల్ పివివి.సత్యనారాయణ మాతృ దినోత్సవ ప్రాముఖ్యత గురించి వివరించారు. 'అమ్మ అందరికీ అమ్మే' అనే అంశంపై చర్చా గోష్టి నిర్వహించారు. రోజువారీ మాదిరిగానే వేసవి విజ్ఞాన శిబిరంలో పాల్గొనే విద్యార్థులకు యోగా శిక్షణ, స్పోకెన్ ఇంగ్లీష్, కథలు-విశ్లేషణ, ఇతర అంశాల గురించి రిసోర్స్పర్సన్లుగా వ్యవహరించిన ప్రముఖులు తెలిపారు. ఇదే నేపథ్యంలో తన మనవరాలు పుట్టినరోజును పురస్కరించుకుని నూకరాజు రూ.ఐదు వేల విలువైన ఆట వస్తువులను వేసవి విజ్ఞాన శిబిరంలో పాల్గొనే విద్యార్థులకు బహూకరించారించారు.

కొనసాగిన వేసవి శిక్షణా శిబిరం




భీమడోలు వేసవి శిక్షణా శిబిరంలో చిన్నారులు

నిడమర్రు: స్థానిక శాఖ గ్రంథాలయంలో వేసవి శిక్షణా శిబిరంలో భాగంగా ఆదివారం మాతృదినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇంటి ఉదయ్భాస్కర్, గ్రంథాలయ పాలకులు బాలరాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

లక్ష్య సాధనతో ముందుకుసాగాలి

ప్రజాశక్తి - మండవల్లి

లక్ష్యాన్ని నిర్దేశించుకుని ఆ లక్ష్యానికి అనుగుణంగా విద్యనభ్యసిస్తే విజయం సొంతమవుతుందని ప్రముఖ కాంపిటేటివ్ ఎగ్జామ్స్ ట్రైనర్ మేడిశెట్టి కళ్యాణ్ స్పష్టం చేశారు. భైరవ పట్టణంలోని శుభం ఫంక్షన్ హాలులో పదో తరగతి, ఇంటర్, డిగ్రీలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు ఉన్నతచదువులు, ఉద్యోగ అవకాశాలపై రాయల్ క్లబ్ ఆఫ్ కైకలూరు సుధా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. విద్యార్థులు ఉన్నతవిద్యపై అవగాహన పెంచుకోవడం ద్వారా తమ లక్ష్యాలను, ఆశయాలను సంకల్ప బలంతో ఉన్నతంగా తీర్చిదిద్దుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. అనంతరం విద్యార్థులు తమ ప్రతిభ, నైపుణ్యాలకు పదునుపెట్టడానికి అవసరమైన వివిధ జాతీయ విద్యాసంస్థలు వాటి విధివిధానాలకు సంబంధించిన అర్హత పరీక్షలకు కావాల్సిన విషయ పరిజ్ఞానం, ఉద్యోగ అవకాశాలపై ఆయన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ పరిధిలో ప్రభుత్వ హైస్కూళ్లలో పదో తరగతి చదివి అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు మెమెంటోలను అందజేశారు. నియోజవర్గంలో అత్యధిక మార్కులు సాధించిన సిహెచ్.యువసాయిప్రదీప్ను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ డాక్టర్ సుధాబత్తుల విజయ్కుమార్, రామిశెట్టి విజయకుమార్, మండవల్లి, కొల్లేటికోట, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.వెంకటేశ్వర్లు, పి.వెంకటేశ్వరరావు, కీర్తి రామ్ప్రసాద్, చిత్తూర్ హర్కికృష్ణ, అల్లాడ పూర్ణచంద్రరావు, వి.ఆంజనేయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఉత్తమ విద్యార్థికి మెమెంటో అందిస్తున్న కల్యాణ్


విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

చాకలి ఐలమ్మ విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి - ఉంగుటూరు

స్వాతంత్ర్య సమరయోధురాలు, రజక సామాజిక మహిళ చిట్యాల ఐలమ్మ విగ్రహాన్ని గొల్లగూడెంలో ఆదివారం ఆవిష్కరించారు. ఈ విగ్రహాన్ని రాష్ట్ర రజక కార్పొరేషన్ ఛైర్మన్ సుగమంచి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో భారతీయ దోబీ మహాసంఘ్ జాతీయ ఉపాధ్యక్షులు చింతాడ శ్రీనివాస్, అఖిల భారత ధోబి మహా సంఘ్ రాష్ట్ర అధ్యక్షులు జిల్లెల శ్రీరాములు, రజక చైతన్య సేవా సంస్థ రాష్ట్ర అధ్యక్షులు కాకినాడ రామారావు, రజక కార్పొరేషన్ డైరెక్టర్లు రేవూరి గోగురాజు, ఈగలపాటి యువశ్రీ, కొండపల్లి దుర్గారావు, రాష్ట్ర నాయకులు అడ్డాల నరసింహారావు, చింతపల్లి గురుప్రసాద్, నడిపూడి నాగబాబు, వెలుదూటి శ్రీనివాస్, నాగపోసి కృష్ణ, రాజమహేంద్రవరపు లక్ష్మణరావు, యండమూరి మహేష్, అంజూరి శ్రీనివాస్, గొల్లగూడెం రజక సంఘం అధ్యక్షులు పల్లంట్ల రాంబాబు, కార్యదర్శి పిప్పర ప్రసాద్, జొన్నాడ శ్రీనివాస్, సభ్యులు పాల్గొన్నారు.

ఏలూరు డిఎస్పిగా శ్రీనివాసులు బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

ఏలూరు సబ్ డివిజన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని ఏలూరు డిఎస్పి శ్రీనివాసులు తెలిపారు. సాధారణ డిఎస్పిల బదిలీల్లో ఏలూరు డిఎస్పిగా నియమితులైన శ్రీనివాసులు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఏలూరు సిసిఎస్ డిఎస్పిగా పనిచేస్తూ ఇప్పటివరకూ ఇన్ఛార్జి డిఎస్పిగా అదనపు బాధ్యతలు నిర్వహించిన జివిఎస్ పైడేశ్వరరావు శ్రీనివాసులుకు బాధ్యతలు అప్పగించారు. 91వ బ్యాచ్కు చెందిన ఆయన వివిధ జిల్లాల్లో డిఎస్పిగా పనిచేశారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు : ఎస్పి


ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని రౌడీషీటర్లను జిల్లా పోలీసులు హెచ్చరించారు. జిల్లా ఎస్పి మేరీ ప్రశాంతి ఆదేశాల మేరకు ఏలూరు జిల్లాలోని రౌడీషీటర్లకు ఆయా పోలీసుస్టేషన్ల పరిధిలో ఆదివారం కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సంబంధిత సిఐలు, ఎస్ఐలు మాట్లాడుతూ రౌడీషీటర్లకు హితబోధ చేశారు. తీరుమార్చుకుని నేరాలకు, గొడవలకు దూరంగా ఉంటూ సత్ప్రవర్తనతో మెలిగితే రౌడీషీట్లు తొలగింపునకు ఉన్నతాధికారులకు సిఫార్సులు చేస్తామన్నారు. సమాజంలో గౌరవంగా బతకాలని ఏదో ఒక పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తూ సంతోషంగా జీవించాలన్నారు.

200 మంది ముస్లిం చిన్నారులకు సున్తీ

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

200 మంది నిరుపేద ముస్లిము పిల్లలకు స్థానిక అంజుమన్ సంస్థ ఆధ్వర్యంలో ఉచితంగా సున్తీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏలూరు నగరపాలక సంస్థ కో-ఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్. పెదబాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు రూ.మూడు లక్షల ఖర్చుతో జిల్లా నలుమూలలు నుండి వచ్చిన 200 మంది పేద ముస్లిములు ఈ అవకాశాన్ని ఉపయోగించుకున్నారన్నారు. క్యాంపునకు వచ్చిన వారికి భోజనం, పాలుతోపాటు గాయం తగ్గేవరకూ ఉచితంగా మందులు ఇస్తున్నారన్నారు. అంజుమన్ సంస్థ చేస్తున్న అనేక సేవా కార్యక్రమాల్లో ఇది ఒకటన్నారు. అంజుమన్ సంస్థకు ఉన్న ఆస్తుల్లో శిథిలావస్థలో ఉన్న షాపింగ్ కాంప్లెక్స్ను రూ.కోటీ 50 లక్షల వ్యయంతో 26 షాపులను నూతనంగా నిర్మించారన్నారు. ఈ విధంగా వస్తున్న ఆదాయంతో పేదలకు ఉచిత వైద్య సహాయం అందిస్తున్నట్లు చెప్పారు. మెడికల్ క్యాంపులు నిర్వహిస్తూ, పేద ముస్లిముల వివాహాలకు, మృతిచెందినవారి మట్టి ఖర్చులకు సహాయం అందిస్తున్నారన్నారు. ఇంకా ఇలాంటి ఎన్నో సేవా కార్యక్రమాలను అంజుమన్ సంస్థ ద్వారా నిర్వహించాలని పెదబాబు కోరారు. సంస్థ అధ్యక్షులు సులేమాన్ మాట్లాడుతూ ఉన్న ఆస్తులను కాపాడుకుంటూ ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్నామని, పెదబాబు సహకారం ఎల్లప్పుడూ ఈ విధంగానే ఉండాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో అంజుమన్ సెక్రటరీ, 46వ డివిజన్ కార్పొరేటర్ ఇలియాస్ పాషా, అంజుమన్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


సున్తీ కార్యక్రమంలో ఎస్ఎంఆర్ పెదబాబు

వైద్య ఖర్చులకు ఆర్థికసాయం

ప్రజాశక్తి - ముదినేపల్లి

అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తికి ఆదివారం అమరావతి బ్రాండ్ మాజీ అంబాసిడర్ అంబులు వైష్ణవి వైద్య ఖర్చులకు ఆర్థికసాయం అందచేశారు. ముదినేపల్లికి చెందిన బాష(50) కొంతకాలంగా పక్షవాతంతో బాధపడుతున్నాడు. దీంతో అతని కుటుంబపోషణ కష్టంగా మారింది. ఈ విషయం తెలుసుకున్న వైష్ణవి తన తండ్రి మనోజ్తో కలిసి బాష ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఆనంతరం రూ.ఐదు వేలు నగదు, నెలకు సరిపడా నిత్యావసర సరుకులు అందించారు. బాష ఆరోగ్యం మెరుగుపడేవరకూ ఉచితంగా వైద్యం చేస్తానని డాక్టర్ మనోజ్ అన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఎంఆర్పిఎస్ నాయకులు ప్రసాద్ పాల్గొన్నారు.

ఘనంగా క్రాంతి హైస్కూల్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం

కలిదిండి: మండలంలోని కోరుకొల్లు క్రాంతి హై స్కూల్లో 2011-12 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణం పండుగ వాతావరణాన్ని తలపించింది. పూర్వవిద్యార్థుల్లో పది మంది సాఫ్ట్వేర్ ఇంజినీర్లు, ముగ్గురు మెడికల్, మరో ముగ్గురు బిజినెస్ ఫీల్డ్, ఒకరు సివిల్ ఇంజినీర్, మరో విద్యార్థి జూనియర్ సివిల్ జడ్జిగా ఉన్నతస్థానాల్లో ఉన్నారు. వీరంతా పాతజ్ఞాపకాలు నెమరువేసుకుంటూ ఆనందంగా గడిపారు. జూనియర్ సివిల్ జడ్జి కుక్కల సాయి శ్రీని ఎంపిపి చందన ఉమామహేశ్వరరావు, కరెస్పాండెంట్ చన్నంశెట్టి కృష్ణ, స్నేహితులు ఘనంగా సన్మానించారు.

ఘనంగా హనుమాన్ జయంత్యుత్సవాలు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

మండలంలోని గురవాయిగూడెం మద్ది ఆంజనేయస్వామి ఆలయం యాత్రికులతో ఆదివారం కిటకిటలాడింది. హనుమాన్ జయంతి సందర్భంగా ఉదయం ఐదు గంటల నుండి ఆలయాన్ని యాత్రికులు అధిక సంఖ్యలో దర్శించుకోవడానికి తరలివచ్చారని ఆలయ కార్యనిర్వహణాధికారి ఎ.కొండలరావు తెలిపారు. పరిసర ప్రాంతాల నుండే కాక సుదూర ప్రాంతాల నుంచి సుమారు 40వేల మందికి పైగా యాత్రికులు, హనుమాన్ దీక్షాదారులు ఆలయాన్ని స్వామివారిని దర్శించినట్లు తెలిపారు. వేసవి కాలం నేపథ్యంలో ఆలయ ప్రాంగణంలో మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేశామని తెలిపారు. అలాగే లక్కవరం పోలీసు సిబ్బంది ట్రాఫిక్ను నియంత్రించి, శాంతి భద్రతలను పర్యవేక్షించారన్నారు. ఒక్కరోజు ఆలయానికి వివిధ సేవల రూపేణా రూ.2,30,370 ఆదాయం సమకూరిందని తెలిపారు. సుమారు ఐదు వేల మందికి అన్నదానం చేశామన్నారు. యాత్రికులకు అసౌకర్యం కలగకుండా ఆలయ ధర్మకర్తల మండలి అధ్యక్షురాలు సరిత విజయభాస్కర్రెడ్డి, ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు సేవలందించారని ఆలయ కార్యనిర్వహణాధికారి ఆకుల కొండలరావు తెలిపారు.

భీమడోలు: మండలంలోని పలుగ్రామాల్లో హనుమాన్ జయంత్యుత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా పొలసానిపల్లి గ్రామ సర్పంచ్ దంపతులు షేక్ హసీనా బేగం హసేన, షేక్ హసేన ఆంజనేయ నగరం, పదో వార్డులోని ఆంజనేయస్వామి ఆలయాలను సందర్శించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. పదోవార్డులోని ఆలయం వద్ద నిర్వహించిన అన్నదానంలో సర్పంచి దంపతులు పాల్గొన్నారు. సుమారు 1500 మంది ఈ అన్నప్రసాదం స్వీకరించారు.

చాట్రాయి : మండల కేంద్రమైన చాట్రాయిలో హనుమాన్ జయంతి సందర్భంగా పోలవరం రోడ్డులోని ఆంజనేయస్వామి భారీ విగ్రహం వద్ద అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేత పర్వతనేని గంగాధర్ పాల్గొన్నారు. అలాగే పర్వతాపురంలోని ఆంజనేయ స్వామి ఆలయంలో అన్నదానం నిర్వమించారు.

నూజివీడు రూరల్: తుక్కులూరులోని అడవి ఆంజనేయస్వామి ఆలయంలో హనుమాన్ జయంతి సందర్భంగా ఆదివారం పూజలు నిర్వహించారు. అనంతరం యాత్రికులకు ప్రసాదాలు అందించారు.

మండవల్లి : హనుమాన్ జయంత్యుత్సవాలు మండలంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక భక్తాంజనేయ స్వామి ఆలయం యాత్రికులతో కిటకిటలాడింది. ఈ సందర్భంగా మూడు వేల మందికి అన్నదానం చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

ముదినేపల్లి : మండలంలో హనుమాన్ జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముదినేపల్లిలోని గురజ రోడ్డులో మారుతీనగర్, స్థానిక కైకలూరు రోడ్డులోని అభయాంజనేయ స్వామి ఆలయంలో వేడుకలు నిర్వహించారు. అదేవిధంగా మండలంలోని చేవూరు, కాకరవాడ, గురజ, సింగరాయపాలెం గ్రామాల్లో హనుమాన్ జయంతిని నిర్వహించారు.

బుట్టాయగూడెం: హనుమాన్ జయంతి వేడుకలు స్థానిక అభయాంజనేయ స్వామి ఆలయంలో ఘనంగా నిర్వహించారు. ఆలయానికి వచ్చిన యాత్రికులకు ప్రసాద వితరణతో పాటు, ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో మజ్జిగ, తాగునీరు అందించారు. ఈ కార్యక్రమాలను ఆలయ నిర్వహణ కమిటీ సభ్యులు వేగి భద్రం, అడపా సత్యనారాయణ, నక్కాని వెంకటేశ్వరరావు, నులకాని దుర్గారావు, లక్కోజు వాసు పర్యవేక్షించారు. శ్రీకోదండరామ స్వామి ఆలయంలో అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

టి.నరసాపురం: కృష్ణాపురంలో బంజారా బజరంగీ భేరి కమిటీ ఆధ్వర్యంలో పంచముఖ ఆంజనేయ స్వామి జయంతి వేడుకలు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన కె.జగ్గవరం సొసైటీ చైర్పర్సన్ వాసిరెడ్డి మధు మాట్లాడారు. అనంతరం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో భూక్యా వేణుగోపాల్, దరువాతు బంగారుబాబు, భూక్యా శ్రీనివాస్. భూక్యా రాంబాబు, భూక్యా రమేష్, హాసవత్ వెంకటేశ్వరరావు, క్యారాజా, భూక్యా సత్తిబాబు, దరువాతు సాకేత్, భూక్యా సురేష్, భూక్యా సునీల్ పాల్గొన్నారు.

లోకేష్కు సంఘీభావంగా నేడు పాదయాత్ర

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

టిడిపి యువనేత నారా లోకేష్ చేపట్టిన పాదయాత్ర వంద రోజులు పూర్తయిన సందర్భంగా మండలంలోని రావిచర్ల గ్రామం నుండి నూజివీడు వరకూ ఈనెల 14వ తేదీన పాదయాత్ర చేపడుతున్నట్లు ఎఎంసి మాజీఛైర్మన్, రావిచర్ల సర్పంచి కాపా శ్రీనివాసరావు తెలిపారు. నూజివీడు పట్టణంలోని ఎన్టిఆర్ భవన్లో ఆదివారం ఆయన మాట్లాడారు. రావిచర్లలోని ఎన్టిఆర్ విగ్రహం నుండి నూజివీడు వరకూ ఈ పాదయాత్ర చేపడుతున్నామన్నారు.

అన్నవరం వరకూ ముద్దరబోయిన పాదయాత్ర

నూజివీడు నియోజకవర్గ టిడిపి ఇన్ఛార్జి ముద్దరబోయిన వెంకటేశ్వరరావు పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి 15వ తేదీ సాయంత్రం నాలుగు గంటలకు నియోజకవర్గ టిడిపి కార్యాలయం నుండి అన్నవరం వరకు పాదయాత్ర చేపట్టనున్నారు.


చేపలు తొలగించి, బ్లీచింగ్ చల్లుతున్న సిబ్బంది

చనిపోయిన చేపల తొలగింపు

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి - ఉంగుటూరు

మండలంలోని యర్రమిల్లిపాడు, నల్లమాడు గ్రామాల మధ్య ఉన్న నల్లమాడు చెరువులో చేపలు చచ్చిపోయి దుర్వాసన వస్తోందని సమస్యపై ప్రజాశక్తిలో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. పంచాయతీ కార్యదర్శి వై.కిషోర్బాబు ఆధ్వర్యంలో ఆదివారం చెరువులో బ్లీచింగ్ చల్లించారు. కుళ్లిన చేపలను దూరంగా తరలించారు.

'మహాత్మ'లో అడ్మిషన్లు ప్రారంభం

ప్రజాశక్తి - ఉంగుటూరు

మహాత్మ ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో వివిధ గ్రూపుల్లో చేరేందుకు అడ్మిషన్లు ప్రారంభమయ్యాయి. ఎంపిసి, బైపిసి, సిఇసి, హెచ్ఇసి ఇంగ్లీషు, తెలుగు మీడియంలలో చేరేందుకు జూన్ 14వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ఇన్ఛార్జి ప్రిన్సిపల్ బివి.శ్రీనివాసు తెలిపారు